ప్రజాశక్తి

శుక్రవారం 2 జనవరి 2026

12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కార్మికోద్యమాలకు

రైతాంగ పోరాటాలే ప్రేరణ

మహాసభ వేదికపై సిఐటియు అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ హేమలత, నాయకులు వరలక్ష్మి, సింధు, ఎంపీ కరీం

- సిఐటియు అఖిల భారత మహాసభలో ప్రతినిధులు
- కార్యదర్శి నివేదికపై విస్తృత చర్చ
- పలు అంశాలపై తీర్మానాలు

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని ఆర్‌కె బీచ్ ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ రెండో రోజైన గురువారమూ ఉత్తేజంగా సాగింది. అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టిన నివేదికపై వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అత్యధిక రాష్ట్రాల నుంచి మాట్లాడిన నాయకులు కార్మికోద్యమాలకు దేశంలో రైతాంగ పోరాటాలే ప్రేరణగా నిలుస్తున్నాయని మిగతా 2లో..

సంజీవిని నిధికి రూ.8.22 లక్షల విరాళాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

2026 నూతన సంవత్సరం సందర్భంగా గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సంజీవిని నిధి - జిల్లా సహాయ నిధికి స్వచ్ఛంద విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ చేసిన విజ్ఞప్తికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సంఘాలు, శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు సామాజిక బాధ్యతా భావానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ రూ.85వేలు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ నుండి రూ.50వేలు, రెవెన్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ నుండి రూ.50వేలు, విద్యా శాఖ నుండి రూ.50వేలతో పాటు అనేక మంది అధికారులు, ఉద్యోగ సంఘాలు, వ్యక్తుల నుండి కూడా స్వచ్ఛందంగా విరాళాలు అందినట్లు చెప్పారు. మొత్తం మీద రూ.8 లక్షల 22వేల 292 విరాళాలుగా అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమిష్ట సహకారం జిల్లాలోని నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సకాలంలో సహాయం అందించడంలో కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు.

సాంకేతికతను జోడించి రోడ్డు భద్రత పెంచాలి

వార్త 2లో..

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

వార్త 11లో..

మొబైల్ వాటర్ టెస్టింగ్ లేబొరేటరీ వాహనం ప్రారంభం

వార్త 2లో..

ఈస్ట్ జోన్ కార్యాలయ ప్రారంభంలో పీలా శ్రీనివాసరావు, కేతన్‌గార్గ్, వెలగపూడి

జివిఎంసి జోనల్ కార్యాలయాలు ప్రారంభం

వార్త 4లో..

రూ.15 కోట్ల మద్యం తాగేశారు

- ★ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం ప్రియుల జోష్
- ★ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో విశాఖ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

విశాఖ నగర పరిధిలో మందుబాబుల్లో న్యూ ఇయర్ జోష్ స్పష్టంగా కనిపించింది. బుధవారం ఉయదం నుండి గురువారం తెల్లవారుజాము వరకు సుమారు రూ.15 కోట్ల మద్యాన్ని తాగేశారు. పెద్ద మొత్తంలో బీర్ అమ్మకాలు జరిగాయి. విశాఖ నరగంలో 150 మద్యం దుకాణాలు, 75 బార్లు ఉన్నాయి. ఇవి కాకుండా స్టార్ హోటళ్లులో నిర్వహించే మద్యం దుకాణాలు మరో 28 ఉన్నాయి. అలాగే నగరంలో దాదాపు అన్ని చోట్ల ఉన్న బెల్టు షాపుల్లో కూడా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. మద్యం దుకాణాలు రాత్రి 12 గంటల వరకు, బార్లు మరో గంట అదనంగా ఒంటి గంట వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వమే అనుమతి ఇచ్చింది. ఇక స్టార్ హోటళ్లలో ఉండే మద్యం షాపులకు టైమింగ్స్‌తో పని లేకుండా పోయింది. దీంతో నగరంలో ఎక్కడ చూసినా మద్యం విచ్చలవిడిగా లభ్యమైంది. మందుబాబులు రెచ్చిపోయారు. దాదాపు అన్ని మద్యం దుకాణాలు మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్స్ నిర్వహణకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వారికి కలిసి వచ్చింది. మద్యం దుకాణాలతో పోలిస్తే బార్లలో మద్యం ధర కాస్త అధికంగా ఉంటుంది. స్టార్ హోటళ్లలో ఇక చెప్పేదే లేదు. అక్కడ ధరతో పనిలేదనే విధంగా మద్యం అమ్మకాలు జరిగాయి. మొత్తంగా చూస్తే ఒక్కొక్క మద్యం దుకాణంలో రూ.7.5 లక్షలు సరాసరి అమ్మకాలు జరిగాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. నిర్దేశించిన సమయంలో మాత్రమే నూతన సంవత్సరం సందర్భంగా మద్యం దుకాణాల అమ్మకాలు జరిగేలా చర్యలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గ్రూపు చర్చలు చేస్తున్న ప్రతినిధులు

కార్మికోద్యమాలకు రైతాంగ పోరాటాలే ప్రేరణ

వివరించారు. రెండో రోజు మూడు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడాన్ని ప్రతినిధుల సభ ఖండిస్తూ చట్ట పరిరక్షణకు తీర్మానం చేసింది. మోడీ ప్రభుత్వం న్యూక్లియర్ ఒప్పందానికి వ్యతిరేకంగా మరో తీర్మానం ఆమోదించబడింది. పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని కోరుతూ మహాసభ తీర్మానం చేసింది.

గురువారం మధ్యాహ్నం కేరళ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, కార్మిక, విద్యాశాఖ మంత్రి వి.శివన్ కుట్టి మహాసభ ప్రాంగణంలో సందడి చేశారు. మహాసభ ప్రాంగణం వద్ద ప్రజాశక్తి బుక్‌స్టాల్‌ను ఆయన సందర్శించారు. కేరళకు చెందిన కైరేళి టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు.

విస్తృతంగా చర్చలు

ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపై ప్రతినిధులు రోజంతా చర్చలు సాగించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటాలపై రాష్ట్రాల వారీగా చర్చలు జరిపారు. వివిధ పత్రాలను మహాసభలో ప్రతినిధులు సమర్పించారు. ప్రతినిధుల సభ మధ్యలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గీతాలు రంజింపజేశాయి.

రూ.15 కోట్ల మద్యం తాగేశారు

తీసుకోవాలని కొన్ని మహిళా సంఘాలు నిరసన తెలిపాయి. అయినా వాటిని ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయలేదు. ప్రభుత్వ ఆదాయ మార్గంగా మద్యాన్ని భావించమేననిదీనికి కారణంగా చెప్పొవచ్చు. కొత్త సంవత్సరం వేడుకలు పూర్తయినప్పటికీ మరో పక్షం రోజుల్లో సంక్రాంతి వేడుకులు రానున్నాయి. అప్పుడు కూడా మద్యం అమ్మకాలు ఇదే రీతిన సాగుతాయని మద్యం వ్యాపారులు భావిస్తున్నారు.

రాష్ట్రంలో అత్యధిక అమ్మకాలు విశాఖలోనే..

ఇది ఇలా ఉండగా, డిసెంబర్ మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా మద్యం అమ్మకాలు వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. దాని ప్రకారం చూస్తే రాష్ట్ర మొత్తం మీద అత్యధికంగా మద్యం అమ్మకాలు విశాఖ జిల్లాలోనే జరిగినట్లుగా తెలిసింది. విశాఖపట్నం జిల్లాలో డిసెంబర్ నెలలో అత్యధికంగా రూ.178.6 కోట్లు మద్యం అమ్మకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

యుజిడి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి యుజిడి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అప్పుఘర్ వద్ద గురువారం ఉదయం ఇ.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారి బిడ్డలకు ఉపాధి కల్పించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లు కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం 11 పిఆర్‌సి విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4న జరుగు సిఐటియు బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న యూనియన్ నేత ఉమామహేశ్వరరావు

మొబైల్ వాటర్ టెస్టింగ్ లేబొరేటరీ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా రాష్ట్రంలోనే మొట్టమొదటిగా విశాఖ నగరంలో మొబైల్ నీటి పరీక్ష ప్రయోగశాల (మొబైల్ వాటర్ టెస్టింగ్ లేబొరేటరీ)ని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ప్రారంభించారు. విశాఖపట్నం వాటర్ సప్లై కంపెనీ (విస్కో) రూ.40 లక్షల సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన మొబైల్ నీటి పరీక్ష ప్రయోగశాలను తొలత డిఎంఒహెచ్‌కు అప్పగించారు. ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందించేందుకు డిఎంఒహెచ్ వారు జివిఎంసి తాగునీటి విభాగానికి నిరంతర నిర్వహణ నిమిత్తం అప్పగించగా ఆ మొబైల్ వాటర్ టెస్టింగ్ లేబొరేటరీ వాహనాన్ని కమిషనర్ బంగ్లా వద్ద కమిషనర్, జివిఎంసి ప్రధాన ఇంజనీర్ పివి.సత్యనారాయణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా వాహనంలో నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించిన సాంకేతిక పరికాలను, ప్రయోగశాలను పరిశీలించారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా విశాఖ నగర చరిత్రలో తొలిసారిగా ఇంతటి అత్యాధునిక సాంకేతికత కలిగిన మొబైల్ వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ మొబైల్ వాహనంలో శిక్షణ పొందిన ప్రొఫెషనల్ కెమిస్టులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల పరిధిలో ఉన్న నివాస ప్రాంతాల వద్దకే ఈ వాహనం నేరుగా వెళుతుందని, ప్రజలు తాము తాగే నీరు ఎంత వరకు సురక్షితమో అక్కడికక్కడే తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ వాహనంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్పెక్ట్రోఫొటో మీటర్, టర్బిడిటీ మీటర్, డిజిటల్ ట్రైబ్రేటర్ వంటి 7 రకాల అదునాతన పరికరాలు ఉన్నట్లు చెప్పారు. వీటి ద్వారా నీటిలోని హానికర లోహాలు, బ్యాక్టీరియా, క్లోరిన్ శాతం, నీటి కఠినత్వాన్ని తక్షణమే గుర్తించవచ్చని పేర్కొన్నారు. కలుషిత నీటి ద్వారా ప్రబలే అతిసార, టైఫాయిడ్ వంటి వ్యాధులను అరికట్టడానికి ఈ ముందస్తు పరీక్షలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి పర్యవేక్షక ఇంజినీర్లు పల్లమరాజు, ఏడుకొండలు, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, శ్రీనివాస్, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

వాహనాన్ని ప్రారంభిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల అక్రమ రవాణా

- చేపల చెరువులకు తరలింపుతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- సేకరించని మున్సిపాలిటీ శానిటేషన్ విభాగం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని దాదాపు అన్ని చికెన్ షాపుల నుంచి కోడి వ్యర్థాలు యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతుంది. ఈ చికెన్ వ్యర్థాలు రవాణా చేయడం చట్టరీత్యా నేరం. అయినా కోడి వ్యర్థాలు అక్రమంగా రవాణా జరుగుతున్నా ఏ మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ చికెన్ వ్యర్థలు తీసుకువెళ్లి చేపలు పెంపకం చెరువుల్లో వేస్తున్నారు. దీంతో భూమి, నీరులో కాలుష్యం పెరుగుతోంది. ఆహార కలుషితమవుతోంది. దీనిపై పర్యావరణ వేత్తలు ఎంత గోల పెట్టినా యలమంచిలి మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ చికెన్ వ్యర్థాలు వేసి పెంచిన చేపలు తినటం వలన మనుషులకు అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రోగానిరోధక శక్తి తగ్గిపోతుంది. చికెన్ వ్యర్థాలు తక్కువ ధరకు రావటం వలన వ్యాపారులు వాటిని అక్రమ దారుల్లో చేపలు చెరువులకు తరలించి డబ్బులు చేసుకుంటున్నారు. తుని నుంచి వచ్చిన ఒక ప్రైవేట్ వాహనంలో బహిరంగానే డ్రమ్ములుతో ఈ వ్యర్థాలను తీసుకెళ్తున్నారు. ఈ వాహనాలు వ్యర్థాల లోడ్‌తో వెళుతుంటే, ఆ రోడ్డులో వెళుతున్న వాహనదారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

చికెన్ దుకాణదారులకు ఈ వ్యర్థాలను తరలించడం పెద్ద పనిగా ఉంటుంది. అయితే ఈ వ్యర్థాల వ్యాపారం చేసే వారు వచ్చి వీటిని తీసుకొని తిరిగి డబ్బులు ఇవ్వడంతో చికెన్ షాపు వారు వారికి ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ వ్యర్థాల తరలింపు ఆగాలంటే మున్సిపల్ అధికారులు ప్రతి చికెన్ దుకాణం నుంచి వ్యర్థాలను కచ్చితంగా తీసుకొని వెళ్ళాలి. ఈ విషయంపై యలమంచిలి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్ల శ్రీనివాస్‌ను చరవాణిలో ప్రజాశక్తి సంప్రదించగా, ప్రస్తుతం మున్సిపాలిటీ సిబ్బంది చికెన్ దుకాణం నుంచి ఎటువంటి వ్యర్థాలను సేకరించడం లేదని, దీంతో షాపు వారే ప్రత్యమ్నాయ మార్గాల్లో ఈ వ్యర్థాలను తరలిస్తున్నారని తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

సాంకేతికతను జోడించి రోడ్డు భద్రత పెంచాలి

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

సాంకేతికతను జోడించి రోడ్డు భద్రతను పెంచవలసిన అవసరం ఉందని, ఆ దిశగా ఆర్టీసీ డిపో మేనేజర్లు చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు అన్నారు. భద్రత సాంకేతికత ద్వారా పరివర్తన అనే థీమ్‌తో జాతీయ రహదారి భద్రతా మాసం కార్యక్రమం జనవరి 1 నుండి 31వ తేదీ వరకు చేపడుతున్నట్లు చెప్పారు. గురువారం విశాఖ జిల్లాలోని ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో రడ్డు భద్రతా మాసోత్సవాల్లో జరగబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్‌కు క్రమం తప్పకుండా పీరియాడిక్ మెడికల్ తనిఖీలు చేయించాలని, డ్యూటీకి వెళ్లే ముందు తప్పని సరిగా ఆల్కహాల్ టెస్టు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధర, అన్ని డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పిల్లలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-జికెవీధి : మండలంలోని రింతాడ పంచాయతీ ఇంద్రనగర్‌లో పాంగిరాజు, చిన్నారి దంపతులకు ఐదుగురు సంతానం. వారు రొయ్యల చెరువులో పనిచేసేందుకు వెళ్తూ తమ ఇద్దరు కుమారులను అమ్మమ్మ దగ్గర అప్పగించి వెళ్లారు. సుమారు 12 సంవత్సరాలుగా పిల్లలిద్దరూ అమ్మమ్మ దగ్గరే ఉంటున్నారు. తల్లిదండ్రులు పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. విషయం తెలుసుకుని మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షులు సోమేశ్ కుమార్, ఉపాధ్యక్షులు రాజేష్ కుమార్, సంఘం సభ్యులు సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు పిల్లలకు దుస్తులు, నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు.

In the Honourable Court of I Addl. Civil Judge (Junior Division) at Bheemunipatnam
O.S.No.1/2024

Between :
Bhumireddy Venkata Bhanu prasada Reddy ...Plaintiff
And:
Duvvi Narasingarao and others ...Defendants

To
10 th defendant : Kuncharla Lakshmayya, S/o Kuncharla Acharyulu, Hindu, aged 37 years, China Polamamba Temple, Sanjay Gandhi Colony, Pedagadili, Visakhapatnam.

SUIT NOTICE

Please take notice that the above named plaintiff filed Injunction suit against the defendants and their henchmen not to interfere with peaceful possession and enjoyment of the plaint schedule property. You are hereby summoned to appear before this Court in person or through your pleader duly instructed able to answer all material questions relating the suit and matter is posted to **dt. 08.01.2026 at 10.30 A.M** and default of your appearance on that day the suit will be heard and determined in your absence.

M.SUNEEL & SINDHURA THADI
ADVOCATES

విమ్స్‌లో అరుదైన చికిత్సలు

-లివర్ సర్జరీలు, జిబిఎస్ అరుదైన వ్యాధికి వైద్యం
-రెట్టింపైన రోగులు

ప్రజాశక్తి - ఆరిలోవ

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) అరుదైన వైద్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఈ ప్రభుత్వ ఆసుపత్రి ఎన్నో రికార్డులను సాధించింది. గడిచిన ఏడాది కాలంలో అనేక అరుదైన సర్జరీలు, అరుదైన వ్యాధులకు వైద్యం అందించి ఉత్తరాంధ్ర ప్రజలకు మరొక సంజీవనిలా నిలిచింది. మౌలిక వసతుల కల్పనలో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా నిలబడుతోంది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రెట్టింపైంది.

లివర్ మార్పిడి ఒక చరిత్ర...

రాష్ట్ర వైద్య చరిత్రలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో లివర్ మార్పిడి సర్జరీ చేసిన మొదటి ప్రభుత్వ ఆసుపత్రిగా విమ్స్ ఆస్పత్రి నిలిచింది. లివర్‌కు సంబంధించిన అరుదైన వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమందికి సర్జరీలు చేసింది.

సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఈ ఏడాది అనేక సంక్లిష్ట శస్త్రచికిత్సలు నిర్వహించింది. పోర్టల్ హైపర్‌టెన్షన్‌కు శస్త్రచికిత్సలు చేసింది. స్ప్లెనిక్ వెయిన్ షంట్ సర్జరీలు, కామెర్లు కలిగించే కణితులకు విప్పుల్స్ ఆపరేషన్, నిరపాయకరమైన పిత్త వాహికకు శస్త్రచికిత్సలు, జిఐ, హెచ్‌పిఎన్ కేన్సర్లు, ప్యాంక్రియాటైటిస్, పేగు టిబి, ఐబిడి, లాపరోస్కోపిక్ స్ప్లెనెక్టమీ, ల్యాప్ ఫండప్లికేషన్ తదితర వాటితో సహ పేగు, అన్నవాహిక, కాలేయం, ప్యాంక్రియాస్, పిత్తాశయం, ప్లీహానికి సంబంధించిన అనేక సంక్లిష్టమైన, రూ.లక్షల్లో ఖర్చు అయ్యే లాపరోస్కోపిక్, ఓపెన్ సర్జరీలను ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేస్తున్నారు.

పిఆర్‌పి ద్వారా కీళ్ల నొప్పులకు స్వస్తి...

విమ్స్ ఆస్పత్రి కీళ్ల విభాగంలో హిప్, జాయింట్స్ సర్జరీలతో పాటు అనేక సర్జరీలను ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నారు. కీళ్ల నొప్పులకు స్వస్తి చెప్పే పిఆర్‌పి థెరపీ అందుబాటులో ఉంది. ఈ థెరపీ కలిగిన ఏకైక ప్రభుత్వ ఆసుపత్రి విమ్స్ కావటం విశేషం.. కార్పొరేట్ ఆసుపత్రిలో ఈ చికిత్స నిమిత్తం రూ.10 వేలు వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంటుంది. కానీ విమ్స్ ఆస్పత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా 2022 నుంచి అందుబాటులో ఉంది. ఈ ఏడాది 110 రోగులకు ఈ థెరపీని అందించి కీళ్ల నొప్పుల నుంచి విముక్తి కలిగించింది.

అరుదైన జిబిఎస్ వ్యాధికు చికిత్స...

ఈ సంవత్సరం వైద్య రంగాన్ని అతలాకుతలం చేసిన వ్యాధుల్లో జిబిఎస్ సిండ్రోమ్ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి వచ్చిన వారు కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది. అలాంటిది ఈ వ్యాధితో బాధపడుతున్న 15 మంది రోగులకు విమ్స్ ఆసుపత్రిలో వైద్యాన్ని అందించింది. విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలోనే ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉండటం జిబిఎస్ సిండ్రోమ్ వ్యాధి నుంచి వేగంగా కోల్కొని సంతోషంగా ఇంటికి వెళ్లారు. ఈ వ్యాధికి సంబంధించి వేల రూపాయల విలువైన ఇంజక్షన్లను విమ్స్‌లో ఉచితంగా అందించింది.

బ్రెయిన్ స్ట్రోక్ కేసులకు చికిత్స....

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి మూడు గంటల వ్యవధిలో రూ.50వేల విలువచేసే ఇంజక్షన్లు అందిస్తే ఆ రోగి వేగంగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఇలా ఈ ఏడాది కాలంలో 503 మంది రోగులు బ్రెయిన్ స్ట్రోక్‌తో విమ్స్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యి చికిత్స పొందారు.

ఎండోస్కోపీ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు..

బయట రూ.3 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు అయ్యే ఎండోస్కోపీ (772), ఇఆర్‌సిపి (50), కోలనోస్కోపి (76), ఆర్‌యుటి బయాప్సీ (112), సిగ్మోడోస్కోపీ (74), ఇవిఎల్ బైండింగ్ (24), ఇయుఎస్ (16), డైలటేషన్ (16), ఎపిసి అండ్ హీమో క్లిప్పింగ్ (14) వంటి స్కాన్లు ఉచితంగా రోగులకు అందిస్తున్నారు.

నూతన పరికరాలతో అరుదైన చికిత్సలు...

ఈ ఏడాది విమ్స్ ఆస్పత్రికి సర్జరీలకు అవసరమయ్యే రెండు వర్క్ స్టేషన్లు, రోగులకు అత్యవసరంగా ఉపయోగపడే నాలుగు వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచితంగా రక్తం...

2025 జనవరిలో విమ్స్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రారంభమయ్యాయి.. ఇప్పటివరకు బ్లడ్ బ్యాంక్ ద్వారా 1349 యూనిట్ల బ్లడ్‌ను రోగులకు ఉచితంగా అందించారు.

మౌలిక సదుపాయాలు కల్పన...

ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి బంధువులకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు ఆసుపత్రి ప్రాంగణంలో మూడు అత్యాధునిక ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు.

రెట్టింపైన రోగులు

విమ్స్ ఆస్పత్రిలో అరుదైన సర్జరీలు, వేలల్లో ఖర్చు అయ్యే వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించటంతో రోగుల సంఖ్య రెట్టింపైంది. 2024లో అవుట్ పేషెంట్లు 1,11,836 ఉండే ఈ ఏడాది 2,24,507గా నమోదైంది. 2024లో ఇన్ పేషెంట్ సంఖ్య 6528గా ఉంటే 2025లో 8867 చేరుకుంది. 2024లో 1943 సర్జరీలు చేయగా 2025లో 2803 మంది రోగులకు సర్జరీలు చేసినట్లు ఆసుపత్రి ప్రతినిధులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

రెయ్యి వెంకటరమణ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న కెకె.రాజు

ఘనంగా రెయ్యి వెంకటరమణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మాధవధార : వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ జన్మదిన వేడుకలను కల్యాణ్ ఫంక్షన్ హాల్‌లో ఆర్‌విఆర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంకటరమణ నిరంతరం ప్రజలతో మమేకమై ఉంటారని చెప్పారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ, వార్డులో సుమారు రూ.60 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అనిల్ రాజు, సాడి పద్మారెడ్డిచ అల్లు శంకర్రావు, వావిలపల్లి ప్రసాద్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను జాగృతం చేసేవారే జర్నలిస్టులు

ప్రజాశక్తి-మధురవాడ : జర్నలిజం సేవా రంగానికి సంబంధించినదని, ప్రజలను జాగృతం చేసేవారే జర్నలిస్టులని పిఎంపాలెం సిఐ గేదెల బాలకృష్ణ పేర్కొన్నారు. మధురవాడలోని మా మీడియా హబ్‌లో 'స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' మధురవాడ యూనిట్ సభ్యులకు డైరీలు, మిఠాయిల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రజలకుపయోగపడే అనేక అంశాలను జర్నలిస్టులు బయట ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐ రాము మాట్లాడుతూ, సమాజాన్ని జాగృతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం తరపున అతిథులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

రోడ్డు నిర్మాణం చేపట్టరూ...

ప్రజాశక్తి -అనంతగిరి: వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డు నిర్మాణం తక్షణమే బీటీ రోడ్డు నిర్మించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మండలానికి మారుమూల పైనంపాడు పంచాయతీ పరిధి ఎగువశోనభ నుండి బల్లి మామిడి, దొండాలవలస వెళ్లే బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు కోరారు. ఇటీవల వర్షాల కారణంగా రోడ్డంతా అస్తవ్యస్తంగా మారి రాళ్లు తేలి గోతులమయంగా మారిందన్నారు.ఈ రోడ్డు మీదుగా ఆ పంచాయతీకి చెందిన ప్రజలు దేవరాపల్లి పంచాయితీ మీదుగా అరకు మండలం ఎక్కువ శాతం ప్రయాణిస్తుంటారు. అలాగే కార్యాలయాలకు, ఇతర పనుల నిమిత్తం చుట్టూ తిరిగి దూరంగా ఉన్న అనంతగిరి మండల కేంద్రానికి ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మట్టి రోడ్డు మీదుగా ద్వి చక్ర, 108 అంబులెన్స్, ఇతర వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత రోడ్డును నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాలకు గిరిజనులు డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో మాదిగల సమస్యలపై మందకృష్ణకు వినతి

ప్రజాశక్తి-చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న మాదిగలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను , ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ దృష్టికి తీసుకెళ్లినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం మహాజన సోషలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుందూరు వెంకటరావు, తెలిపారు. కృష్ణమాదిగను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని సామాజిక, భౌగోళిక సమస్యలు, అభివృద్ధిపై వివరించినట్లు తెలిపారు. దీనిపై కృష్ణమాదిగ స్పందించి, . ఏజెన్సీ ప్రాంతంలోని మాదిగలకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయాఈ సమస్యలను సంబంధిత వేదికల్లో లేవనెత్తుతానని భరోసా ఇచ్చారన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పరిధిలోని హరే కృష్ణ వైకుంఠంలో గల రాధా మధన మోహన మందిరంలో శ్రీ నరసింహ యజ్ఞం నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ లీలలను పాటలు, నృత్య రూపంలో ప్రదర్శించారు. కృష్ణ కల్యాణికి ఆకాంక్ష, శ్రావణి, దేవర్షి, కాళింగ నర్తనానికి గాయత్రి, రాజి, కూచిపూడి నృత్యాన్ని భువన నృత్య ప్రదర్శనలిచ్చారు.

జెడ్‌సిని కలిసిన అశోక్ చక్రవర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల భీమిలి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.నాగేంద్రకుమార్‌ను స్థానిక సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి గురువారం జోనల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛంఅందజేశారు. యుసిడి పిడి వికె.దొరను కలిసి కేలండర్ అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.

కల్వర్టులో కోడి వ్యర్థాలు

దుర్వాసనతో ఇబ్బందులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 2వ వార్డు పరిధి వలంద పేట ప్రాంతంలో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న పలు చికెన్ దుకాణదారులు కోడి వ్యర్థాలను సర్వీస్ రోడ్డులో ఉన్న కల్వర్టులో పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసనతో రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కుక్కలు తిష్ట వేసి వ్యర్థాలను తిని చిందర వందర చేస్తున్నాయి. ఈ కుక్కలు గ్రామాల్లోకి వెళ్లి పిల్లలు, పెద్దల మీద దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కోడి వ్యర్థాలను కల్వర్టులో పడేస్తున్న వ్యాపారులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఆశ్రమం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సౌమ్యనంద

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత డెయిరీఫారమ్ వద్ద ఉన్న ఇందిరాగాంధీనగర్‌లోని ఆనంద్ మార్గ ఆశ్రమంలో పేద విద్యార్థులకు 350 దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆచార్య సౌమ్యనంద అవధూత ఆధ్వర్యంలో ధ్యాన శిబిరం నిర్వహించారు. నగరంలో ఉన్న ఆనంద మార్గ సభ్యులు భజన, ధ్యానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆచార్య సౌమ్యనంద మాట్లాడుతూ, మానవ జన్మ చాలా విలువైనదని దాన్ని సార్థకత చేసుకోవాలని కోరారు. స్మార్ట్ వార్త సంపాదకులు పూజారి రవి, ఆనంద్ మార్గ్ సీనియర్ సభ్యులు వైఎస్.రాజు, ఆర్‌వి.పాత్రో, ఉష, చలం కల్యాణి పాల్గొన్నారు.

జీవన్‌దాన్‌తో వెలుగులు

ప్రజాశక్తి - అరిలోవ : జీవన్ దాన్ కార్యక్రమం ద్వారా 301 మంది జీవితాల్లో నూతన వెలుగులు నిండాయి. 2025లో బ్రెయిన్ డెడ్ అయిన 93 మంది నుంచి 301 అవయవాలు సేకరించి అవయవాల కోసం ఎదురుచూస్తున్న వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపింది. రాష్ట్రంలో జీవన్ దాన్ కార్యక్రమం 2015లో ప్రారంభమైన నుంచి ఇప్పటివరకు 1293 అవయవాలను సేకరించి అవసరమైన రోగులకు అందించి వారి జీవితాల్లో ఆనందాన్ని తీసుకొచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన 403 మంది వ్యక్తుల నుంచి 703 కిడ్నీలు, 316 లివర్లు, 91 గుండె, 181 ఊపిరితిత్తులు, 2 ప్యాంక్రియాసిస్, ఒక స్మాల్ బౌల్ అవయవాలను సేకరించింది.

రాష్ట్రంలో జీవన్ దాన్ కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు అవుతున్నప్పటికీ గడిచిన రెండేళ్లుగా అవయవదాన కేసులు క్రమంగా పెరుగుతున్నాయని జీవన్ దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించే అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా అవయవదానాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

అభినందించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి..

రాష్ట్ర జీవన్ దాన్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య శాఖ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 300 అవయవాలను సేకరించి రికార్డు సృష్టించిన తరుణంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తన సోషల్ మీడియా ద్వారా జీవన్‌దాన్ టీమ్‌ను అభినందించారు. ఒక్క ఏడాది కాలంలోనే 300 మందికి పైగా జీవితాల్లో కొత్త వెలుగులు నింపటం అభినందనీయమని కొనియాడారు.

క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వాలీబాల్, బాక్సింగ్, బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు సొంత నిధులతో సమకూర్చిన మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి క్రీడలలో రాణించి దేశానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. వచ్చే సంవత్సరం నాటికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి అందిస్తానని హామీ ఇచ్చారు.

సింహాచలంలో స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గురువారం 'స్వర్ణ పుష్పార్చన' సేవ వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ఆదేశాల మేరకు, డిప్యూటీ ఇఒ సింగం రాధ ఆధ్వర్యాన కె.వెంకటేశ్వరావు పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమం జరిపారు. వేకువజామునే అర్చకస్వాములు అప్పన్న స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, సంప్రదాయబద్ధంగా పూజలు, ఆరాధనలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారిని అలంకరించి, ఆలయ కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. 108 బంగారు స్వర్ణ పుష్పార్చన విశిష్ట పుష్పాలతో స్వామివారికి అర్చన చేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న "సింహాద్రి నాథ నిత్య అన్నప్రసాద పథకానికి" యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, లింగోజీగూడెం గ్రామానికి చెందిన బి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి రూ.1 లక్ష విరాళం అందించారు. దాత రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధను గురువారం కలిసి చెక్కును అందజేశారు. విరాళం అందజేసిన అనంతరం దాతకు దేవస్థానం అధికారులు స్వామి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు "వేదాశీర్వచనం" గావించారు. అనంతరం ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు దాతను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

మూడో రోజుకు 'రాపత్తి' ఉత్సవం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న 'రాపత్తి' ఉత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. గురువారం సాయంకాలం ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ పర్యవేక్షణలో, ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టిపి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యుల సారథ్యంలో శాస్త్రోక్తంగా ఈ వేడుకలు నిర్వహించారు.

జివిఎంసి జోనల్ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : ప్రజల సౌలభ్యం కోసం జోనల్ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ జోన్ పరిధిలోని 5, 6, 7, 8, 98 వార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల, కార్పొరేటర్ మొల్లి హేమలత, గరే గురునాథ్, కానూరి అచ్యుతరావు, సోంబాబు, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట సమీపంలోని 8వ జోన్ కార్యాలయాన్ని పెందుర్తి జోనల్ కార్యాలయంలో జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను పది జోన్లుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలో జనాభా గణనీయంగా పెరగడంతో అందుకు తగ్గట్టు జోన్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జోనల్ కార్యాలయం పరిధిలోని కార్పొరేటర్లు, జోనల్ కమిషనర్ శంకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. నూతన సంవత్సర సందర్భంగా మేయర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు పలువురు అధికారులు, కార్పొరేటర్లు పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సీతమ్మధార : మాధవధార వుడా కాలనీలో నార్త్ జోనల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ నగర అభివృద్ధి, జిపిఎంసి పరిపాలనా సౌలభ్యం కోసం జోన్‌లను పునర్వ్యస్తీకరణ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ బి.రాము, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, కంటిపాము కామేశ్వరి, పర్యవేక్షక ఇంజినీర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఉక్కునగరం : అగనంపూడిలో నూతనంగా ఏర్పాటుచేసిన జోనల్ కార్యాలయాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ జోనల్ కార్యాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

భీమునిపట్నం : జివిఎంసి భీమిలి జోనల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సందీప్, గంటా అప్పలకొండ, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, జోనల్ కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, జోనల్ కమిషనర్

ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధి ఆశీలుమెట్ట వద్ద ఉన్న ఈస్ట్ జోన్ జోనల్ కార్యాలయాన్ని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం జివిఎంసి పరిధిలోని 8 జోన్లను 10 జోన్లుగా పునర్వ్యస్తీకరణ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, కార్పొరేటర్లు కెల్ల సునీత, అప్పారి శ్రీవిద్య, గొలగాని మంగవేణి, గేదెల లావణ్య, గొలగాని వీరారావు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, జోనల్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

పెందుర్తి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే పంచకర్ల

విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన దక్షిణ జోనల్ కార్యాలయాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రేషన్ కార్డుదారులకు చెక్కి గోధుమపిండి ప్యాకెట్లు పంపిణీ చేశారు.

జివిఎంసి పదవ జోన్‌గా అనకాపల్లి

అనకాపల్లి : జివిఎంసి ఏడో జోన్‌గా ఉన్న అనకాపల్లి పదవ జోన్‌గా మారిన నేపథ్యంలో గురువారం అనకాపల్లి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో జోనల్ కమిషనర్ చక్రవర్తి పదవ జోన్‌గా అనకాపల్లి కార్యాలయాన్ని ప్రారంభించారు. అంనతరం జివిఎంసి జోనల్ కార్యాలయ పరిసరాలను, డంపింగ్‌యార్డును ఎమ్మెల్యే కొణతాల పరిశీలించారు సిబ్బందితో మాట్లాడి, వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జోన్ సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. డంపింగ్ యార్డ్‌ను అతి త్వరలోనే తరలిస్తామని, సిబ్బంది ఇబ్బందుల్ని అర్థం చేసుకుంటున్నామన్నారు. గ్రేటర్ విశాఖలో అన్ని జోన్ల కంటే అనకాపల్లి జోన్‌లోనే అత్యధిక పన్ను వసూలు చేయడంపై సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి రూ.1.50 లక్షల విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌విఎన్.దుర్గా ప్రసాదరావు అమెరికాలో నివసిస్తున్న తన కుమార్తె ఎన్.పద్మజ తరపున లయన్స్ హాస్పిటల్ అభివృద్ధి కోసం రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగించనున్నారు. మేనేజింగ్ ట్రస్టీ లయన్ ప్రొఫెసర్ వి.ఉమా మహేశ్వరరావు చెక్కును అందుకున్నారు. పద్మజకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లయన్స్ కేన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్‌లో నూతన సంవత్సర వేడుకలు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.సూర్య ప్రకాష్ సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ ఎం.ఉషారాజు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ పాత్రో, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణ్ ప్రసాద్, యూరాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ జోస్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ మాల, డాక్టర్ వెంకటేశ్వర్లు, లయన్ నాయకులు చంద్రశేఖర్, ఉదయ్ శంకర్, రామారావు, దుర్గా ఆనంద్ పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు చెక్కును అందిస్తున్న దుర్గాప్రసాదరావు

ప్రజాశక్తి కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పంచకర్ల సందీప్

ప్రజాశక్తి -ఆనందపురం : జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఎండాడ జనసేన కార్యాలయంలో ప్రజాశక్తి 2026 ఆఫీస్ కేలండర్, నూతన డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ పంచకర్ల మాట్లాడుతూ, ప్రజాశక్తి పత్రిక ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తుందన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ, విలువలతో కూడిన పత్రికగా ప్రజాశక్తి విశేష గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమి రామస్వామి, శాఖరి శ్రీను, నాయకులు తమ్మిన అప్పలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ముడసల శ్రీను, ప్రజాశక్తి భీమిలి డివిజన్ డిఒ వెంకటరమణ, విలేకర్లు తిరురాజు, నర్సునాయుడు, చిన్న శ్రీను, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి అంబేద్కర్ నగర్‌లోని శ్రీ షిర్డి సాయి రామ మందరం వద్ద నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్‌కుమార్, యల్లపు వెంకటేశ్వరరావు, శ్రీను, పద్మ తదితరులు పాల్గొన్నారు.

31వ సారి రక్తదానం చేసిన సిఐ సుధాకర్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే.వీధి మండలం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ 31వ సారి రక్తదానం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రాడేరు జిల్లా ఆసుపత్రిలో గురువారం రక్తదానం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి 90 రోజులు దాటిన తర్వాత స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం చేస్తూ అనేకమంది ప్రాణాలను కాపాడారు. సీఐ సుధాకర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అధికారులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పలువురు కోరారు.



రక్తదానం చేస్తున్న సిఐ

సామాజిక న్యాయం ఎక్కడ?

- రిజర్వేషన్లకు పాలకులు తూట్లు
- ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం
- 'శ్రామిక ఉత్సవ్' వేదికపై పలువురు వక్తలు

శ్రామిక ఉత్సవ్‌లో మాట్లాడుతున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి, వేదికపై ధనలక్ష్మి, వైఎల్, సుబ్బన్న తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దేశంలో సామాజిక న్యాయం కరువవుతోందని, రిజర్వేషన్లకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో గురువారం 'సామాజిక న్యాయం - సాధనకు ఉద్యమిద్దాం' అనే థీమ్‌తో కార్యక్రమం తలపెట్టారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ దర్శకులు సత్యారెడ్డి మాట్లాడుతూ చలనచిత్రం సమాజంలో మార్పు తీసుకువచ్చే అతిపెద్ద మీడియా వ్యవస్థ అని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను నిర్మించిన 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్లలో విడుదలై విజయవంతమైందని తెలిపారు. విశాఖలో 100 రోజులు ప్రదర్శితమైందని అన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యమ స్ఫూర్తితో సుద్దాల అశోక్ తేజ రాసిన పాటను తన చిత్రంలో వాడుకునేందుకు అనుమతించిన సిఐటియు నాయకులు సిహెచ్.నర్సింగరావు, అయోధ్యరామ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన ఎదుగుదలకు ప్రజా యుద్ధనౌక గద్దర్ ఎంతో సహకరించారని, భవిష్యత్తులో ఉద్యమల స్ఫూర్తితో మరిన్ని చిత్రాలు తీసి ప్రజలను చైతన్యం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు సుబ్బన్న మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లను ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ఉపాధి హామీపై కేంద్రం దాడి పట్ల ఆయన నిప్పులు చెరిగారు. ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డాక్టర్ వైఎల్.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ విధానాల వల్ల సామాన్యులకు ఆ సేవలు భవిష్యత్తులో అందని ద్రాక్షగా మారుతాయని, దీనిపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి, సామాజిక న్యాయాన్ని మాత్రం 125 అడుగుల లోతున పూడ్చిపెట్టారని తెలిపారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుగా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మనుధర్మ శాస్త్రం గురించి మాట్లాడే శక్తులు దళితులను, మహిళలను అణచివేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 4వ తేదీన విశాఖలో జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేసి పాలకులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, దుశ్యంత్, ప్రముఖ న్యాయవాది వెంకటేష్, బి.నగేష్ పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవం..

శ్రామిక చైతన్య వేదిక

సినీ దర్శకుడు సత్యారెడ్డి ప్రశంసలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

అక్షరం ఆయుధంగా, జ్ఞానం మార్గదర్శిగా సాగే పోరాటాలే సమాజంలో మార్పును తీసుకువస్తాయి. ఈ సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకుని సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' ప్రస్తుతం విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన పుస్తక మహోత్సవం మేధావులను, పుస్తక ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. గురువారం సాయంత్రం ఈ పుస్తక ప్రదర్శనను ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, నిర్మాత సత్యారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి స్టాల్‌ను కలియతిరుగుతూ, అక్కడ కొలువుదీరిన వేలాది పుస్తకాలను పరిశీలించారు. ప్రజాశక్తి బుక్ హౌస్, సిఐటియు సహకారంతో ఇంత భారీ స్థాయిలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సందర్శనలో భాగంగా సత్యారెడ్డి కేవలం పుస్తకాలను చూడటమే కాకుండా కొన్ని అరుదైన గ్రంథాల చరిత్రను, వాటి సేకరణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో ఇన్ని వైవిధ్యమైన పుస్తకాలను ఒకే వేదికపై చూడటం అరుదైన విషయమని, సామాజిక చైతన్యాన్ని రగిలించే ఇటువంటి ప్రదర్శనలు నేటితరానికి ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న సత్యారెడ్డిని చూడగానే పుస్తక ప్రేమికులు, విద్యార్థులు ఉత్సాహం ప్రదర్శించారు. ఆయన కూడా ఎంతో వినమ్రంగా సందర్శకులతో ముచ్చటించి, వారితో ఫొటోలు దిగారు. పుస్తక పఠనం పట్ల యువత ఆసక్తి చూపడం శుభపరిణామమని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. శ్రామిక ఉత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పుస్తక మహోత్సవం కేవలం పుస్తకాల అమ్మకపు కేంద్రంగానే కాకుండా, ఆలోచనల వేదికగా మారుతోంది. సత్యారెడ్డి వంటి ప్రముఖుల సందర్శన ఈ ఉత్సవానికి మరింత శోభను చేకూర్చింది.

పుస్తక ప్రదర్శనను సందర్శిస్తున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి

సంస్కృతి విశాలమైనది

- పరిరక్షణకు రాజీలేని పోరాటాలు అవసరం
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, వేదికపై ఎస్.వెంకటరావు

ప్రజాశక్తి - గాజువాక

సంస్కృతి విశాలమైనదని, దాన్ని కాపాడుకోవడానికి రాజీలేని పోరాటాలు అవసరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై గురువారం 'బహుళ సంస్కృతులు - భారతీయతత్వం' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్కృతి ఎలా అభివృద్ధి చెందిందీ వివరించారు. ఉమ్మడి సంస్కృతిలోనే జీవించే హక్కు, భాష, చిత్రలేఖనం, కలిసి జీవించి ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకోవడం వంటివి వచ్చాయన్నారు. సైన్స్, టెక్నాలజీ ఈ సంస్కృతిలో నుంచే వచ్చాయన్నారు. ఉన్నతమైన మానవ విలువలు వైపు పెరగాలనేదే సంస్కృతి అని చెప్పుకొచ్చారు. అయితే ఆధిపత్య సంస్కృతి పేరుతో ప్రజల మధ్య గొడవలు పెట్టి అదాని లాంటి వ్యక్తులు దోపిడీ చేసుకోవడానికి పాలకులు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఆ దోపిడీపై ప్రజలు తిరగబడతారనే భయంతోనే ముందుగానే కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలపై ఆధిపత్య సంస్కృతిని రుద్దుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో వీరబ్రహ్మం, వేమన, మొల్ల రాసిన గ్రంథాల్లోని అభ్యుదయవాదాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఆదిపత్య వైఖరిపై పోరాటం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తోందని అన్నారు. విశ్వ మానవ సంస్కృతిని కాపాడేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ ఒక సంస్కృతిని చూసి మరొక సంస్కృతి పాటిస్తున్నవారు అసూయపడుతున్నాయన్నారు. సంస్కృతి అభివృద్ధి చెందాలే తప్ప అసూయ పెరగరాదన్నారు. దేశంలో వేషధారణలోనూ, ఆహారంలోనూ, నడవడికలోనూ ఒకరిని ఒకరు అసహ్యించుకోవడం పెరిగిందన్నారు. చైనాలో ఈ విధమైన విధానాలు లేవని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, బహుళ సంస్కృతి కలయికే భారతీయతత్వం అన్నారు. అన్ని సంస్కృతులనూ కాపాడుకోవాలన్నారు. యు.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పి.శ్రీనివాసరావు పాడిన పాట ఆకట్టుకుంది. సభానంతరం అతిథులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
శుక్రవారం 2 జనవరి 2026



మహాసభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

సిఐటియు మహాసభ దృశ్యమాలిక

విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభ గురువారానికి రెండోరోజుకు చేరుకుంది. కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చలు జరిపారు. దేశంలోని కీలక పోరాటాల్లో పాల్గొన్న వారంతా ఇక్కడకు రావడంతో ఉత్తేజపూరిత వాతావరణం నెలకొంది.



ప్రజాశక్తి బుక్‌స్టాల్ వద్ద కేరళ కార్మిక శాఖ మంత్రి శివన్‌కుట్టి

పాలస్తీనాకు మద్దతు

వేదికపై హేమలత, వరలక్ష్మి, సింధు మాటామంతి

విజూకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేత

మహాసభ ప్రాంగణంలో తపన్‌సేన్, సిహెచ్.నర్సింగరావు

మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఉత్సవ్ వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

ఆట.. పాట.. అదరహో

'శ్రామిక ఉత్సవ్'లో ఆకట్టుకుంటున్న కళారూపాలు

ఉద్యమ ఘట్టాలను తన హావభావాలతో రక్తికట్టిస్తున్న కళాకారుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ప్రజానాట్య మండలి కళాకారులు ఆరో రోజు గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆట, పాట, పలు అభ్యుదయ గేయాలు, నృత్య రూపకాలు సభికులకు ఆద్యంతం ఆలోచింపజేశాయి. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, జివిఎంసి, తదితర రంగాల, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన, నిర్వహిస్తున్న ఐక్యపోరాటాలను, సాధించిన హక్కులను గుర్తుచేస్తూ 'పోరాటాల సంఘమో.. సిఐటియు సంఘమో' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది. జివిఎంసి కార్మికులు ప్రదర్శించిన తీన్‌మాన్ సభికులను ఆకట్టుకుంది. 'అమ్ముతుంటే చూస్తామా.. ప్రభుత్వ రంగాన్ని', 'ప్రయివేటు భూతం లేచింది బిడ్డా', 'పాడి ఆవును అమ్మేసి.. పాలు కొనుక్కుందామా'.. అంటూ ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ఎలా కార్పొరేట్లకు పాలకులు కట్టబెడుతున్నదీ కళాకారులు వివరించారు.

'తలకు మించి పరుగెత్తి.. తెల్ల ఏనుగు అంటారు' అంటూ ప్రభుత్వ రంగం ప్రాధాన్యతను వివరిస్తూ 'సబ్సిడీలు ఇచ్చింది.. సాయంగా వచ్చింది', 'గుడ్డిలోన మెల్ల లాగ.. ఆపదలో అన్న లాగ' అంటూ కళాకారులు పాడిన పాట ఆహూతులను హత్తుకుంది.

మన రక్తం ధారబోసి పెంచిన సంపదను కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకోబోమని హెచ్చరిస్తూ 'పోనీ అనుకోవద్దు.. పాలికేకై నిలదీద్దాం' అంటూ కళాకారులు పాడిన పాటకు సభికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది.

'సంపద సృష్టికి మూలం.. చెమట చుక్కరే అన్నా' అంటూ 'పొలాల్లో పంటలు పండించడంలోనూ, పరిశ్రమల్లో యంత్రాలు, యంత్ర పరికరాల తయారీలోనూ వ్యవసాయ కూలీలు, కార్మికులు పడే కష్టాన్ని వివరించే ప్రయత్నం చేశారు కళాకారులు. 'ఏళ్లయినా ఏలికలు మారినా.. మారలేదు మన బతుకులు' అన్న పాట ద్వారా శ్రమజీవుల పట్ల పాలకుల వైఖరిని కళ్లకు కట్టినట్లు కళాకారులు వివరించారు. హక్కుల కోసం ఎర్రజెండా అండగా ఉందని చెబుతూ 'ఎర్రెర్రని జెండా చేత బట్టి శ్రామిక రాజ్యం తేవాలి' అంటూ పాడిన పాట చైతన్యం నింపింది.

సరోజ బృందం ఆధ్వర్యాన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'జాగోరె జాగో' ప్రదర్శన ఆకట్టుకుంది. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత పోరాటాల ద్వారానే భవిష్యత్తు ఉందని చెబుతూ 'యువతతోనే భవిత సాధ్యం.. నేటి మాట సత్యం' అన్న పాట అందరినీ ఆలోచింపజేసింది. 'ఆశయాల భవిత మనది.. దారి చూపు వెలుగు మనది' అంటూ పాడిన పాట యువత పోరాటాల మార్గాన్ని ఎంచుకోవాలన్న సందేశాన్ని ఇచ్చింది.

'సమ్మె నీ జన్మ హక్కు రా.. దాన్ని ఆపే దమ్మెవడికి ఉందిరా' అంటూ ఉప్పు సత్యాగ్రహం దర్శకులు, నటులు సత్యారెడ్డి పాడిన పాటకు సభికుల నుంచి స్పందన లభించింది. ఉత్తరాంధ్ర ప్రజా గాయకులు వంగపండు ప్రసాదరావు పాడిన 'ఎం పిల్లడో ఎల్దమొస్తవో.. చికాకుళం కడ చీమకొండ కడ' అంటూ ఆయన కుమారుడు దుష్యంత్ పాడిన పాటకు సభికులు చప్పట్లతో సభాస్థలి మార్మోగింది.

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రపై కాకినాడ ప్రజానాట్య మండలి కళాకారుల బృందం నృత్యరూపకాన్ని ప్రదర్శించింది. జాతీయోద్యమంలో సుందరయ్య పాత్ర, ఆయన చేసిన త్యాగాన్ని వివరించారు. ఏ రూపంలోనైనా దోపిడీని సుందరయ్య ధీటుగా ఎదురొడ్డిన వైనాన్ని వివరించారు కళాకారులు. సైకిల్‌పై నెల్లూరు వెళ్లి టోకుగా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి దళితవాడల్లో అందజేసిన సుందరయ్య మానవత్వాన్ని చాటిచెప్పారు. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం సజీవంగా చూపిన వాడు సుందరయ్య' అంటూ కమ్యూనిస్టు యోధుని ఔన్నత్యాన్ని వివరించారు.

శ్రమజీవి విశిష్టతను తెలియజెబుతూ కళాకారిణి ప్రదర్శన

విప్లవ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

శ్రమ విశిష్టతను తెలియజెబుతూ కళాకారుల నృత్యరూపకాలు

ప్రదర్శనలతో చైతన్యం రేకెత్తిస్తున్న కళాకారులు

ప్రభుత్వ రంగంపై కార్పొరేట్ల దోపిడీని వివరిస్తూ సాగిన కళా ప్రదర్శన

అంతిమ విజయం కార్మికులదేనంటూ సాగిన సన్నివేశం

ప్రశంసాపత్రాలతో కళాకారులు

యువత డ్యాన్స్

కార్మికుల పోరుతో దిగొచ్చిన యుబి

లాభాలే తప్ప కార్మికులు ఖాళీ కడుపుతో ఉన్నా తమకేమీ సంబంధం లేనట్టుగా కొన్ని కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. ఉత్పత్తి తగ్గిందనే పేరుతో పనిదినాలకు కోత పెట్టి వారిని పస్తులు ఉండేలా చేస్తున్నాయి. ఉత్పత్తి పెరిగినా, లాభాలు వచ్చినా పని దినాలు పెంచడానికి ససేమిరా అంటున్నాయి. కార్మికులు కడుపు మండి ఆందోళనలు చేస్తే, అప్పడు దిగొచ్చి పని ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీ ఇదే కోవలోకి వస్తుంది. యాజమాన్యం తీరుపై యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు పలురూపాల్లో పోరాటం సాగించిన తర్వాత పని దినాలను పెంచింది. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుంది.

ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

- **ఉత్పత్తి తగ్గిందని పనిదినాల కోత**
- **పలురూపాల్లో ఆందోళనలు చేసిన శ్రామికులు**
- **కార్మికుల తొలగింపును అడ్డుకున్న సిఐటియు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో తమకు ఆర్డర్లు తగ్గాయని, ఎక్కువ రోజులు పని ఇవ్వలేమని కంపెనీ యాజమాన్యం చేతులెత్తేసింది. నెలలో ఏడు నుంచి పది రోజులు మాత్రమే పని ఇచ్చి మిగిలిన రోజులు కార్మికులను ఇళ్లకే పరిమితమయ్యేలా చేసింది. దీనిపై కార్మికులు భగ్గుమన్నారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు జాతీయ రహదారి దిగ్బంధనం, చలో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, రణస్థలంలో ర్యాలీ, భిక్షాటన తదితర రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. పనిలో నుంచి 300 మంది కార్మికులను తొలగించాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో ఆందోళనలు ఉధృతం కావడంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. కార్మికులకు కొన్ని రోజులపాటు పని ఇవ్వడానికి కూడా నిరాకరించడంతో, కార్మికులు ఆందోళనతో వారం రోజుల పాటు పని కల్పించింది.

పనిదినాలు పెంచిన యాజమాన్యం

2024 ఎన్నికల ముందు వరకు వారం, పది రోజుల పాటు పని కల్పించిన యాజమాన్యం, ప్రస్తుతం 13 రోజుల వరకు పని కల్పిస్తోంది. కంపెనీ ఉత్పత్తి, వ్యాపార విస్తరణ పెరిగినా ఆ మేరకు కార్మికులకు పని కల్పించడానికి మాత్రం అంగీకరించడం లేదు. కంపెనీ వ్యవహారాల్లో బిజెపికి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తన మనుషులకు చెందిన కొందరికి కంపెనీలో పని ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో, అదనంగా కొంతమందికి పని కల్పించినట్టు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు 13 రోజులకు మించి పని దొరకని పరిస్థితి నెలకొంది.

లఘుచిత్రాలు.. సామాజిక చైతన్యానికి ప్రతిబింబాలు

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న ఆహూతులు

కళ కేవలం వినోదానికే కాదు.., అది సమాజాన్ని మేల్కొలిపే ఆయుధమని విశాఖ వేదికగా నిరూపితమైంది. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ముందస్తు వేడుకల్లో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'శ్రామిక ఉత్సవ్' అట్టహాసంగా సాగింది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సమన్వయంతో జరిగిన లఘు చిత్రాల ప్రదర్శన.. సమకాలీన సమస్యలను, శ్రామిక జీవుల వ్యధలను, రాజకీయ వైఫల్యాలను అత్యంత శక్తివంతంగా వెండితెరపై ఆవిష్కరించింది. ప్రదర్శనలో భాగంగా సుమారు 4 రోజుల పాటు 30 లఘు చిత్రాలను ప్రదర్శించారు. పద్మశ్రీ సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ నటి రోహిణి, మాదాల రవి, విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ వంటి ప్రముఖులు ఈ ప్రదర్శనలకు హాజరై.. దర్శకులను అభినందించడం విశేషం.

తెరపై ప్రదర్శిస్తున్న లఘుచిత్రం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం లఘుచిత్రాల ప్రదర్శనలో ప్రధానంగా నిలిచింది. సుదీప్ సాయి రూపొందించిన 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్', కౌశిక్ దర్శకత్వంలో వచ్చిన 'సేవ్ స్టీల్‌ప్లాంట్', చంద్రశేఖర్ తెరకెక్కించిన 'మహా వృక్షం' లఘు చిత్రాలు స్టీల్‌ప్లాంట్‌ను కేవలం ఒక ఫ్యాక్టరీగా కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారంగా, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా చూపాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'మై ఓట్ నాట్ ఫర్ సేల్' చిత్రం ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో కళ్లకు కట్టినట్లు చూపింది. ఆర్.భార్గవ రాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది. నగరాన్ని శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల జీవితాలపై కె.మహేష్ బాబు తీసిన 'అన్సంగ్ హీరోస్', పుష్యమి దర్శకత్వం వహించిన 'శ్రామిక జీవన సౌందర్యం' చిత్రాలు వారి నిస్వార్థ సేవను, వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతను హృద్యంగా ఆవిష్కరించాయి. కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' ఉత్తరాంధ్ర జనజీవన కష్టాలను ప్రతిబింబించింది. నేటి యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై పలు చిత్రాలు చర్చించాయి. ఫ్యుబె క్రియేషన్స్ వారి 'ఎఫ్ 2' నిరుద్యోగ యువత ఆవేదనను చూపగా, దామోదర్ దర్శకత్వంలో వచ్చిన 'యుద్ధం ప్రకటించు', 'ఇది ఆరంభం' చిత్రాలు డ్రగ్స్ మహమ్మారిపై యువత పోరాడాలని పిలుపునిచ్చాయి. పి.రమేష్ కుమార్ తీసిన 'జయహే' మత సామరస్యాన్ని ప్రబోధించగా, సనరా వంశి రూపొందించిన 'మాతృదేవోభవ' వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించింది. ఉమామహేష్ దర్శకత్వంలోని 'ఇంక్' చిత్రం కలం బలాన్ని, మేధావి వర్గం సమాజం పట్ల చూపాల్సిన బాధ్యతను చాటిచెప్పింది. భీశెట్టి జయబాబు రూపొందించిన 'బాల్యవివాహాలు నిర్మూలిద్దాం' చిత్రం ఆడపిల్లల హక్కుల కోసం గళమెత్తింది.

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్‌భరత్

ప్రముఖుల ప్రశంసలు - ప్రోత్సాహం

లఘుచిత్రాల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ వాస్తవికతకు దగ్గరగా సినిమాలు తీయడం అభినందనీయమన్నారు. నటి రోహిణి, మాదాల రవి.. చిత్రాల నాణ్యతను, దర్శకుల సామాజిక స్పృహను కొనియాడారు. కేవలం విశాఖకే కాకుండా విజయవాడ, నిడదవోలు, శ్రీకాకుళం వంటి ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచిందని నిర్వాహకులు ఎల్లాజీ, కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ లఘు చిత్రాల ప్రదర్శన కేవలం ఒక కళా ప్రదర్శనగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక గళంగా నిలిచింది. కార్మికుల హక్కులు, సామాజిక బాధ్యత, దేశ భవిష్యత్తుపై చర్చను రేకెత్తించడంలో ఈ 'శ్రామిక ఉత్సవం' విజయవంతమైంది. భవిష్యత్తులో కార్మిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని ప్రకటించడం ఈ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం.

ఎదుగుబొదుగూ లేని కమీషన్!

- మూడునెలలుగా అందక రేషన్ డీలర్ల అగచాట్లు
- పదేళ్లుగా పెరుగుదల లేని ప్రోత్సాహకం
- డిపోల్లో హెల్పర్లు ఏర్పాటు చేయాలని వినతి
- ఎన్నికల హామీ అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : రేషన్ సరుకులు సరఫరాకు గాను ఇస్తున్న కమీషన్ డబ్బులు మూడు నెలలుగా చెల్లించకపోవడంతో రేషన్‌డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకుగాను రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీరికి చెల్లించాల్సిన కమీషన్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని వీరంతా వాపోతున్నారు.అరకొరగా చెల్లిస్తున్న కమీషన్ డబ్బులు నెలల తరబడి చెల్లించకపోతే, తమ కుటుంబపోషణ, రేషన్ డిపోల నిర్వహణ ఎలా సాధ్యమని వీరు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం క్రిస్మస్, కొత్తసంవత్సరం, తర్వాత సంక్రాంతి పెద్దపండుగ వస్తున్న నేపథ్యంలో కమీషన్ డబ్బులు రాకపోవడంతో ఆయా పండుగ నిర్వహణకు ఇబ్బందులు పడక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం జనవరి .నెల సరుకులు విడిపించి పంపిణీకి, అలాగే పండుగలకు కొత్తబట్టలు ఇతర అవసరాలకు అప్పులు చేయక తప్పని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వినియోగదారులకు బియ్యం, పంచదార, ఇతర రేషన్ సరుకులు పంపిణీకి డీలర్లకు ప్రభుత్వం కమీషన్ చెల్లిస్తోంది. కిలో బియ్యానికి ఒక రుపాయి, పంచదార ప్యాకెట్ పాకెట్ ఒక్కటికి 50పైసలు మాత్రమే కమీషన్ వస్తుంది. గత పదేళ్లగా ఎదుగూబొదుగూ లేకుండా ఇదే కమీషన్ చెల్లిస్తుండడంతో అరకొర కమీషన్‌తో రేషన్ డిపోలు నడపటం కష్టంగా ఉందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో వెహికల్ ఆపరేటర్లు ఉండడంతో పంపిణీతో సంబంధం లేకుండా కమీషన్ డబ్బులు వచ్చేవని, ఇపుడు డిపోల వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేస్తుండడంతో అపుడు వచ్చే కమీషన్‌తోనే వినియోగదారులకు సరుకులను పంపిణీ చేస్తున్నామని డీలర్లు అంటున్నారు. గతంలో కార్డుదారుల ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ సమయంలో తమకు డిపోల వద్ద హెల్పర్లు పెట్టుకునే అవసరం ఉండేది కాదని, ఎండిఎం ఆపరేటర్లు వస్తే వారికి సరుకులు ఇస్తే సరిపోయేదని అంటున్నారు.కానీ ఇపుడు డిపోల వద్ద రేషన్ సరుకులు పంపిణీతో హెల్పర్‌ను పెట్టుకుంటేగానీ, సక్రమంగా సరుకులు పంపిణీ చేసే పరిస్థితి లేదంటున్నారు. దీంతో హెల్పర్ రూపంలో అదనపు ఖర్చు డీలర్లే భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు బియ్యం బస్తాల్లో తరుగు ఎలాగూ ఉంటుందని అంటున్నారు.వీటికి తోడు వృద్ధులు, కొందరు వికలాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేసే అదనపు బాధ్యతలను కూడా తాము నిర్వహిస్తున్నామని డీలర్లు అంటున్నారు.

కూటమి ప్రభుత్వం హామీ అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిపోల వద్దే రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు చేపట్టడంతోపాటు డీలర్లకు ఇచ్చే కమీషన్ పెంచుతామని, మేనిఫెస్టోలో పెట్టడంతోపాటు ఎన్నిక హామీ ఇచ్చిందని డీలర్లు అంటున్నారు. దీంతో మొదటి వాగ్దానం నెరవేర్చినా, తమ కమీషన్ పెంపు మాత్రం ఏడాదిన్నర గడిచినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీకి కిలోకు కనీసం రూ.3 కమీషన్‌తోపాటు నెలసరి గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే బకాయిలు లేకుండా ఏనెలకానెల కమీషన్‌తోపాటు గౌరవం వేతనం చెల్లించాలని కోరుతున్నారు.అలాగే రేషన్ డిపోల్లో సరుకులు పంపిణీకి హెల్పర్లను ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా యుటిఎఫ్ నాయకులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యుటిఎఫ్ డైరీ, కేలండర్, 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఉపాధ్యాయు లంతా సమిష్టిగా కృషిచేసి ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని సూచించారు.ఉపాధ్యాయ సంఘంగా ఉంటూ పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు తయారు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, నాయకులు మామిడి బాబూరావు, బైలపూడి దేవుడి నాయుడు, యాదగిరి రాము, సలీం పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం ఆపరేటర్ల ఎంపికకు
6లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-.అనకాపల్లి : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పొడి చెత్త నిర్వహణను మరింత పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛరథం కార్యక్రమంలో ఆపరేటర్ల ఎంపికకు ఈనెల 6లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.అవసరమైన పత్రాలతో ఈనెల 6లోగా ఎంపిడిఒలకు అందజేసిన దరఖాస్తులను 9న జిల్లా స్థాయి కమిటి పరిశీలించి, ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తుందన్నారు.

ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు, స్క్రాప్ డీలర్లు, మెటీరియల్ ఫెసిలిటీ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ నిర్వాహకుల నుండి స్వచ్ఛరథం ఆపరేటర్లుగా దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. పొడి చెత్త లేదా స్క్రాప్ నిర్వహణలో మూడేళ్ల అనుభవం, చెల్లుబాటయ్యే ట్రేడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని సూచించారు. అత్యల్ప 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కోట్ చేసిన వారిని ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారన్నారు. అనకాపల్లి జిల్లాలో మొదటివిడతలో అనకాపల్లి, అచ్యుతాపురం, రావికమతం మినహా మిగిలిన మండలాల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తారన్నారు. ప్రతిమండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారని, ఒక డీలరు ఒకటి కంటే ఎక్కువ మండలాల్లో దరఖాస్తు చేసుకుంటే విడివిడిగా అప్లికేషన్లు సమర్పించాలి. దరఖాస్తు రుసుముగా ఎంపిడిఒ పేరిట రూ.పది వేలు డిడి చెల్లించాలి. ఆధార్,పాన్‌కార్డు, నివాస ధ్రువీకరణ, సంస్థ రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుభవం, ట్రేడ్ లైసెన్స్, మూడేళ్ల ఐటి రిటర్న్స్, వాహన వివరాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో అప్లికేషన్లు ఎంపిడిఒలకు అందజేయాలని సూచించారు.

గుండుపాలెం మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- కె. కోటపాడు : మండలంలోని గండుపాలెం మాజీ సర్పంచ్ బండారు రామస్వామి పాత్రుడు బుధవారం రాత్రి మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపిటిసిగా, ప్రజలకు విశేషమైన సేవలు అందించిన రామస్వామిపాత్రుడు, మండలస్థాయిలో గుండుపాలెం గ్రామానికి గుర్తింపు తెచ్చారు. రామస్వామిపాత్రుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి పెద్దదిక్కు కోల్పోయామని పలువురు ఆవేదన వెలిబుచ్చారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన

క్రీడాకారులకు అభినందిస్తున్న సీఐ రామచంద్రరావు

ప్రజాశక్తి-సబ్బవరం : హైదరాబాద్‌లో జరిగిన సౌత్ జోన్ క్రీడలలో ఖోఖో, క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన మండలంలోని స్థానిక సన్ రిడ్జ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులను గురువారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సత్తిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సీఐ జి రామచంద్రరావు, వైసిపి రాష్ట్రకార్యదర్శి గండి రవికుమార్, స్థానిక సర్పంచ్ డి.ప్రసాదరావు పాల్గొని విద్యార్థులకు అభినందించారు. ఖోఖో పోటీల్లో 8వతరగతి విద్యార్థిని కోటాన తేజశ్రీ ప్రథమస్థానంలో నిలవగా, రన్నరప్‌గా నిలిచిన క్రికెట్ పోటీల్లో దిలీప్, జ్ఞానేంద్ర, కిరణ్, సాత్విక్ నాయుడు రాణించారని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలలో రాణిస్తే వారికి స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు వస్తాయన్నారు. గండి రవికుమార్, డి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ సత్తిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి -అనకాపల్లి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక కొణతాల సుబ్రమణ్యం ఘాట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయి, ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కేంద్రం అందించిన రూ.12.5వేల కోట్లతో ఇప్పటికే .88శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆర్థికసంక్షోభంలో కూరకుపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం పురోభివృద్ధి దిశగా తీసుకెళుతోందన్నారు. ఒకేమాట, ఒకేబాటగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలన రాష్ట్రచరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందన్నారు. 15ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లను సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్ పరిష్కరించారని, జాబ్‌మేళాల ద్వారా ఏడాదిన్నరలో నాలుగు లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. రూ.1.30లక్షల కోట్లతో ఏర్పాటౌతున్న మూడు గూగుల్ సెంటర్ల ద్వారా నిలక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌టిఎ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) నూతన సంవత్సర కేలండర్, డైరీలను గురువారం డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎన్‌టిఎ బృందం గురువారం డిఇఒను మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ కేలండర్, డైరీలను ఆవిష్కరింపజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టివి.రమణ, ఎస్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆర్ఎం లాజిస్టిక్ కేలండర్ ఆవిష్కరణ

అనకాపల్లి : ఆర్ఎం లాజిస్టిక్ సంస్థ నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), అనకాపల్లి ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎం లాజిస్టిక్ అధినేత బుద్ధ రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'పప్పల' జన్మదిన వేడుకలు

మాజీ ఎంపీ చలపతిరావుకు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి టౌన్ : మాజీ ఎంపీ పప్పల చలపతిరావు జన్మదిన వేడుకలు గురువారంరాంబిల్లి మండలం దిమిలి గ్రామం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేయగా, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు చలపతిరావును దుశ్శాలువాలు, పూలకుండీలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో యలమంచిలి పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్ల శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, అడారి ఆదిమూర్తి, రమణ బాబు, కరణం రవికుమార్, దాడి రమేష్, మజ్జి రామకృష్ణ, నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం దిమ్మల వితరణ

నేతవానిపాలెం వాసులకు బెల్లం దిమ్మలు ఇస్తున్న ఎంపిటిసి రమణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట- 2 ఎంపిటిసి సూరిశెట్టి రమణ తన కుమారుడు రాజేష్ జ్ఞాపకార్థం గురువారం నేతవానిపాలెం గ్రామస్తులకు గురువారం కిలో బరువు గల బెల్లం దిమ్మలను పంపిణీ చేశారు. గ్రామంలోని 180 రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికీ ఒక్కో కిలో బెల్లం దిమ్మ చొప్పున అందజేశారు. ఏటా రాజేష్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వియ్యపు ముత్యాలు నాయుడు, నరేష్ పాల్గొన్నారు.

సందడిగా నూతన సంవత్సర సంబరాలు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు నేతలు, అధికారులు వేడుకల్లో పాల్గొని కేకు కట్ చేశారు. వీరికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నేతల ఇళ్ల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సందడి నెలకొంది.

ఎస్‌పి తుహిన్‌సిన్హాకు శుభాకాంక్షలు చెబుతున్న పోలీసులు

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఆమె కార్యాలయంలో పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.. కలెక్టరుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రెవెన్యూ, జిల్లా రవాణా శాఖ, విద్యాశాఖ, భూసర్వే సెటిల్మెంట్స్, డిపిఒ, సిపిఓ, డిఎంహెచ్ఒ, పౌర సరఫరాల శాఖ, డిఆర్ఒ, హౌసింగ్, డిఆర్‌డిఎతదితర శాఖల అధికారులు ఉన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి తుహిన్ సిన్హా కేక్ కట్ చేసి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్‌పిని జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్‌పిలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణుస్వరూప్, జి.ఆర్.ఆర్.మోహన్, బి.మోహనరావు, ఈ.శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ కృష్ణచైతన్య, పలువురు సిఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజిలను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసారు.

వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)కు పలువురు అభిమానులు, శ్రేయోభిలాషులు, బంధు మిత్రులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అక్కినేనిఫాన్స్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాము యాదవ్, హరిప్రసాద్ ఉన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలో గల పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగానే నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబుకు పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.వైసిపి మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు కు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు

యలమంచిలి టౌన్ : పట్టణంలోని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ నివాసంలో మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారితో కలిసి కేకు కట్ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఆడారి వెంకట్, దొడ్డి వెంకటేష్, దాడి నాయుడు, వేగి వెంకటేష్, మల్ల శివ, ఒగిబోయిన చిరంజీవి, డాడీ రమేష్, కార్యకర్తలు, నాయకులు, విశాఖడైరీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలం ఎస్‌టిబిఎల్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు అధికారులు, ప్రజలు, యువకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, పుస్తకాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సబ్బవరం : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు జనసేన,కూటమి నేతలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మొగలిపురం గ్రామంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గండి బాబ్జికి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరవాడ : ఎంపిపి పైలా వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాసరావుకు ఆమె స్వగృహంలో పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కశింకోట: ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు లకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒఇఒ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ ఎంపిడిఒ తోటారావు, ఎఒ ఖాన్ పాల్గొన్నారు. సిఐ స్వామినాయుడుకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో వైస్ ఎంపిపిలు పెంటకోట శ్రీను జ్యోతి, నమ్మి మీనా గణేష్ టిడిపి నాయకులు వేగి గోపికృష్ణ, బాబర్, పెంటకోట రాము, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణ రావు, కలగ సోమేశ్వరరావు పాల్గొన్నారు. పరవాడపాలెం సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయడు పంచాయతీ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు

దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాలకు చెందిన టిడిపి నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేవరాపల్లి మాజీ మండల టిడిపి అధ్యక్షుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, పెంటకోట అప్పలనాయుడు, గొర్లె దేముళ్లు,బండారు శ్రీరామూర్తి, బాబ్జి, తేడా చిన్నారావు తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గోపాలపట్నం : జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెహరా భాస్కరరావును ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, కర్రి అప్పలస్వామి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని వైసిపి కార్యాలయంలో ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కె.లక్ష్మణ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వారికి మండల ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, రేవిడి పిహెచ్ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వద్దకు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలుపుకున్నారు.

ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును 13వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తురకపూడి బాలస్వామి, మారిక జక్కన్న, కిల్లాశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు (వాసు రాజు)కు పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు ఎంపిపి ఛాంబర్‌లో కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా వారందరి సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ కెవి.నరసింహారావు, డిప్యూటీ ఎండిఒ రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెందుర్తి : సుజాతనగర్‌లోని జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో అభిమానులు కార్యకర్తలు నడుమ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కేకు కట్ చేశారు. పెందుర్తి నియోజకవర్గం ప్రజలు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ పీలా శ్రీనివాసరావును అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మన్యం జిల్లా వైసిపి పరిశీలకులు శరగడం చిన అప్పలనాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వెలగపూడికి శుభాకాంక్షలు చెబుతున్న వార్డు నాయకులు

ఎలమంచిలిలో ఎమ్మెల్యే విజయకుమార్‌కు శుభాకాంక్షలు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న కాయల వెంకటరెడ్డి, సూరారెడ్డి

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెవిఆర్ డెవలపర్స్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, మేనేజింగ్ ట్రస్ట్ పార్టనర్ కాయల సూరారెడ్డి, ఎసిపి లక్ష్మణమూర్తి, నాలుగో పట్టణ సిఐలు, ఎస్ఐలు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం వైసిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, కుమార్తె సరి సహస్రతో కలిసి కేక్ కట్ చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరై వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్‌రెడ్డి శ్రీనివాసరావు, బంక సత్యం, షినగం దాము పాల్గొన్నారు.

వేములవలసలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోరాడ రాజబాబు గృహానికి కార్యకర్తలు భారీగా తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సారికి విజయ్, రాజు పాల్గొన్నారు. ఎండాడ జనసేన పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మిన అప్పలరాజు, కుప్ప రామలక్ష్మి, చల్లా రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వగృహంలో కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాత్రాజు అప్పారావు, బిఆర్‌బి. నాయుడు, కేబుల్ శ్రీను పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు సిఐటియు జాతీయ మహాసభలు జరుగుతున్న ప్రాంతంలోని ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావుకు యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఉరుకూటి రాజు ఫ్లవర్ బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

నక్కపల్లి:మండలంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి తదితర ముఖ్య నాయకులకు, ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహామూర్తికు ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు, పలువురు అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారుకు నేతల శుభాకాంక్షలు

భీమిలి ఎంపిపి వాసురాజుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపిడిఒ

సబ్బవరంలో ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు

బుచ్చయ్యపేటలో కేకు కట్ చేస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

ఎలమంచిలిలో కేకు కట్ చేస్తున్న ఆడారి ఆనందకుమార్

ఎంపీ సిఎం రమేష్, గండిబాబ్జిలకు నేతల శుభాకాంక్షలు

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు పంపిణీ చేస్తాం: కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లాలో భూములురీసర్వే పూర్తయిన 373 గ్రామాలలో 2,01,841 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వ ముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాసుపుస్తకాలను ఈనెల 2 నుంచి 9 వరకు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ గ్రామసభలను నిర్వహించి, ప్రజా ప్రతినిధుల సమక్షంలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు.దీనిపై గ్రామాల్లో విఆర్ఒలు, ఇతర అధికారులు ముందస్తుగా సమాచారం అందిస్తారని, రైతులు గ్రామసభలకు వెళ్లి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకోవాలని సూచించారు.

బుచ్చయ్యపేట : ఈ నెల 2 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి, రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. గ్రామసభల షెడ్యూల్‌ను వివరించారు. 2న ఉదయం దిబ్బిడి, చిన్నప్పున్నపాలెం, మధ్యాహ్నం అయితంపూడి, 3న ఉదయం తైపురం, చిట్టియ్యపాలెం, మధ్యాహ్నం రాజాం, 5న తురకలపూడి, పిపి అగ్రహారం, మధ్యాహ్నం చింతపాక, కరక, 6న ఉదయం గంటికోర్లం, భట్లోవ, మధ్యాహ్నం పొట్టిదొరపాలెం, ఎల్‌బిపి అగ్రహారం, 7న ఉదయం నీలకంఠాపురం ఆర్ భీమవరం, మధ్యాహ్నం ఆర్ శివరాంపురం,పెదపూడి, 8న ఉదయం మల్లం, మధ్యాహ్నం ఎంబి పాలెం 9న ఉదయం అప్పం పాలెం మధ్యాహ్నం మంగళాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, బయోమెట్రిక్ ధ్రువీకరణ, ఇకెవైసితో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సబ్బవరం : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 2 నుంచి 9 వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్, ఎంపిటిసిలు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు సమక్షంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తారన్నారు. గ్రామసభల షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఈ నెల 2న విప్పాక అగ్రహారం, ఆసకపల్లి, 3న ఎరుకు నాయుడుపాలెం, గాలి భీమవరం, 5న లగిశెట్టి పాలెం, రాయపురఅగ్రహారం, టెక్కలి పాలెం,6న బంగారమ్మ పాలెం, ఎ.సిరసపల్లి 7న అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, బోదువలస, 8న సిహెచ్.అగ్రహారం, మొగలిపురం, ఇరువాడ 9న పైడివాడ అగ్రహారం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామన్నారు.

చీడికాడ: ఈనెల 2వ తేదీ నుండి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ జరుగుతుందని తహసిల్దార్ కిషోర్ లింకన్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 2న ఎల్బీపట్నం, వెల్లంకి, చీడిపల్లి, నీలంపేట, 3న వీరపురాజుపేట, తంగుడుబిల్లి, పెదగోగాడ, 5న తునివలస, వింటిపాలెం, 6న డి.సురవరం, కె అగ్రహారం, అడవిల అగ్రహారం, 7న అప్పల రాజుపురం, ఖండివరం, 8న కొండ సోంపురం, సిరిజం, సీతారాంపురం 9న జైతవరం, బి.సింగవరం గ్రామాల్లో 8,067 పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల్లో భూముల చేర్పులు, మార్పులకు మళ్లీ అవకాశం ఉంటుందని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ కిషోర్ లింకన్ తెలిపారు.

భీమునిపట్నం : మండలంలో భూముల రీ సర్వే జరిపిన గ్రామాల్లో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయనున్నట్లు తహశీల్దార్ పైలా రామారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో వీటిని రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. 2న చిప్పాడ, 3న టి.నగరపాలెం, 5న నిడిగట్టు, 6న బోడమెట్టపాలెం, 7న ఆర్‌వై.అగ్రహారం, 8న సింగనబంద గ్రామాల్లో మొత్తం 2,888 మంది రైతులకు పాసు పుస్తకాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసం, రాపత్తు అధ్యయన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా పలు ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేసారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనం, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషా చార్యులు, గోపాలాచార్యులు, పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు పాల్గొన్నారు.

దుప్పట్లు, కేలండర్‌ను పంపిణీ చేస్తున్న ఎంపిటిసి సభ్యులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో పెదతీనార్ల పంచాయతీ దొండవాక గ్రామంలోని చర్చిలో గురువారం నూతన సంవత్సరం వేడుకలు పురస్కరించుకొని ఎంపీటీసీ సభ్యులు మేరిగి నాగేశ్వరరావు చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, క్యాలెండర్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ లు సుధీర్, అమ్మ కల్పన, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జానకయ్యపేటలో వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో జానకయ్యపేట గ్రామంలోని కొత్త కాలనీలో గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు ఆర్థిక సహాయంతో నిర్మాణం చేపట్టిన వాటర్ ట్యాంక్ ను గురువారం ఆ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కురుందాసు అప్పలరాజు, నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందరరేగా అప్పలరాజు మాట్లాడుతూ, సుమారుగా లక్ష రూపాయలతో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ ట్యాంకు ద్వారా ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పంపనబోయిన తులసీరావు, చందక నానాజీ, మామిడి అప్పలరాజు, గింజాల తాతరాజు, పలువురు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ట్యాంక్ ప్రారంభిస్తున్న నాయకులు

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- మధ్యలో నిలిచిన పనులు - అవస్థలు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వైసీపీ పాలన ఐదేళ్లు పట్టించుకోక పోవడంతో తుప్పల మధ్య దర్శనమిస్తున్నాయి. దీంతో, కోట్లాది రూపాయిలు నిరుపయోగమయ్యాయి. గత్యంతరం లేక ఉద్యోగులు అద్దె భవనాల్లో చాలీచాలని వసతుల మధ్య విధులు నిర్వరిస్తున్నారు.

ఏఎల్.పురంలో రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఒక అంగన్వాడీ భవనం, ఇతర నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం సుమారు రూ.2కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అట్టహాసంగా ప్రారంభించిన ఆయా భవనాల నిర్మాణాల పనులు చాలా వరకు పిల్లర్లకే పరిమితమయ్యాయి. రెండు, మూడు భవనాలు శ్లాబ్ వేసి, ప్లాస్టింగులు చేసి వదిలేశారు. రెండు సచివాలయాలకు ఒకటి భవనం పూర్తయింది. అయితే టైల్స్, ఫర్నిచర్ ఇతరత్రా చిన్నచిన్న పనులు పూర్తి చేయలేదు. మరొక సచివాలయం భవనం శ్లాబ్‌కే పరిమితమైంది. రెండు రైతు భరోసా కేంద్రాల భవనాల్లో ఒకటి పిల్లర్లకే పరిమితం కాగా, మరొకటి శ్లాబ్ వేసి వదిలేశారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ భవనం శ్లాబ్ వేయగా మరికొన్ని భవనాలు సగానికి పైగా చేసి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో, సచివాలయం-1 సంబంధించిన ఉద్యోగులు పాత పంచాయతీ భవనంలోను, సచివాలయం-2 ఉద్యోగులు మూతపడిన శిథిలమైన ఎస్సీ బాలుర వసతి గృహంలోను విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు అంగన్వాడీ, కమ్యూనిటీ హెల్త్ భవనం పూర్తికాక అద్దె భవనాల్లో ఉద్యోగులు, అంగన్వాడీ చిన్నారులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ భవనాలు అసంపూర్తిగా ఉండటంతో కొంత మంది యువతకు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిపోయాయి. దీనికి తోడు వైసీపీ పాలనలో నాడు నేడు నిధుల కొరతతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో విద్యార్థులు వైద్య సిబ్బందికి రక్షణ కరువైందని తల్లిదండ్రులు, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎఎల్.పురంలో శ్లాబ్‌కే పరిమితమైన సచివాలయ-1 భవనం

అసంపూర్తిగా ఎఎన్ఎం సబ్ సెంటర్ భవనం

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

◆ అంబేద్కర్ గురుకుల విద్యార్థులతో ముఖాముఖిలో కలెక్టర్ విజయకృష్ణన్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- సబ్బవరం : విద్యార్థుల భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని, కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్‌తో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ గురుకులం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కేకు కట్‌చేసి, విద్యార్థులందరికీ మిఠాయిలు పంచి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చెడు ఆలోచనలు ప్రక్కన పెట్టి బాగా చదివి మంచి ఉద్యోగం పొందాలని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు.తల్లిదండ్రుల కన్న కలలు నెరవేర్చి, జీవితం సార్థకత చేసుకోవాలన్నారు. ఆరో తరగతి విద్యార్థి జి శామ్యూల్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి జోష్ ఇంగ్లీష్‌లో మాట్లాడి జిల్లా కలెక్టర్ మెప్పు పొందారు. పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించి టాపర్లుగా నిలవాలని ఆకాంక్షించారు పాఠశాలలో రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ చిన్నికృష్ణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ సిహెచ్ కేశవరావు, ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త గ్రేసి, ఎంపిడిఒ పి పద్మజ, ఎంఇఒ ఎస్. లక్ష్మణరావు, డిటి సిహెచ్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

పొగ మంచుతో పరేషాన్!

◆ దారి కానరాక వాహనదారుల ఇక్కట్లు

దేవరాపల్లిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి- కె.కోటపాడు : పొగ మంచు విస్తారంగా కురవడంతో గురువారం మండల ప్రజలు ఇబ్బంది పడ్డారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు రోడ్లు, జనావాసాలను కమ్మేసినంతంగా పొగమంచు కమ్మేయడంతో దగ్గర్లోని వ్యక్తులు, వస్తువులు సైతం కనబడని పరిస్థితి నెలకొంది. వాహనరాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్లు కనపడక లైట్లు వేసుకొని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.. ద్విచక్ర వాహనదారులు పాద చారులు ఇబ్బంది పడ్డారు. పొలం పనులకు వెళ్లేందుకు ఉదయం 8గంటల వరకు రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

దేవరాపల్లి: మండలంలోని రైవాడ, పరిసర గ్రామాలలో దట్టమైన పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణం సాగించాల్సి వచ్చింది. చలిగాలులతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు అగ్గి కుంపట్లు పెట్టుకొని ఉపశమనం పొందగా, పలుచోట్ల చలిమంటలు వేసుకుని వెచ్చతనాన్ని పొందుతున్నారు.

4న సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని..

పలుచోట్ల విస్తృత ప్రచారం

ఈ నెల 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. పరవాడ ఫార్మాసిటీలో ర్యాలీ చేశారు. అచ్యుతాపురం, దోసూరులో ప్రచారం చేశారు.

పరవాడ ఫార్మాసిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నేతలు కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి -పరవాడ:సిఐటియు అఖిల భారత మహాసభల్లో భాగంగా ఈనెల 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం పరవాడ ఫార్మా సిటీలో జనవరి 4 చలో విశాఖ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జి కోటేశ్వరరావు, గనిశెట్టి మాట్లాడుతూ, సిఐటియు ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో విశాఖ వేదికగా 18వ అఖిలభారత మహాసభ జరుగుతోందని,ఈ మహాసభకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి ప్రతినిధులు హాజర వుతున్నారన్నారు. మహాసభకు ముగింపుగా 4న ర్యాలీ, బహిరంగ సభలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. బహిరంగసభ జయప్రదానికి కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.రమణ, ముసలినాయుడు, శేషు, అప్పలరాజు, సత్తిబాబు పాల్గొన్నారు



యలమంచిలి టౌన్ : సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా ఈనెల 4న కార్మిక ర్యాలీ, బహిరంగసభ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు పిలుపునిచ్చారు. గురువారం అచ్యుతాపురం మండలంలో తిమ్మరాజుపేట, దోసూరు, అచ్యుతాపురం గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. అచ్యుతాపురంలో మణికంఠ భవన నిర్మాణ సంఘం, దోసూరులో ఉమాసమేత సోమేశ్వరస్వామి తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ముందుగా నూతన సంవత్సర కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కావాలని కాంక్షిస్తూ, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు రూ.పది వేల విరాళం అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, కార్మికులకు గుర్తింపు కార్డులు, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కారం వంటి కార్మిక సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ఈ సందర్భంగా చలో విశాఖ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కన్నూరు రమేష్, సబ్బవరపు రాజు, రమణ, పలపాల రాజు, శ్రీ మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు రాజన్న అప్పలనాయుడు , సింగంపల్లి రాజు నాయుడు, జి పైడిరాజు, కె.రాజు, ప్రసాదు, వసంత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దోసూరులో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

అచ్యుతాపురంలో భవన నిర్మాణ కార్మికుల నినాదాలు

అల్లూరి జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో, నిబద్ధతతో విధులకు పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం తన క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జిల్లాలలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రజల పట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించి వారికి కావలసిన సేవలు అందించడానికి, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్క పేద కుటుంబానికి అందేలా అన్ని శాఖల సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పని చేయాలని కోరారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు, అభినందనలు తెలిపిన వారిలో జిల్లా సూపర్ ఇంటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దార్, ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డిఓ, డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, సర్వే అండ్ లాండ్స్ అధికారి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది, రెవిన్యూ పరిపాలనాధికారి, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అనంతరం రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల 2026 కరపత్రాలు, రెవిన్యూ శాఖ నూతన డైరీ, 2026 సంవత్సర గోడ కేలండర్లను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆవిష్కరించి వాటిని విడుదల చేశారు.

పాడేరు: అల్లూరి జిల్లా విభజనపై కలెక్టర్ దినేష్ కుమార్ జిల్లాల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మీడియాతో మాట్లాడారు. కొత్తగా ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పడిన పోలవరం జిల్లాతో రంపచోడవరం పరిసరాల ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఉంటుందన్నారు. చింతూరు డివిజన్ 4 మండలాల ముంపు పరిధిలో ప్రభుత్వ పునరావాస పరిహారాలు వెంటవెంటనే ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. పోలవరం జిల్లా 12 మండలాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్త జిల్లాకు ప్రభుత్వం ఐదు కోట్లు మంజూరు చేసిందని రంపచోడవరంలో ఐటిడిఏ, పీఎంఆర్సి భవనాలు వినియోగించుకుంటామని చెప్పారు. అల్లూరి జిల్లా 11 మండలాలకు కుదిరించబడిందని, దీంతో ఏడు లక్షల జనాభా కలిగిన గిరిజనులకు పరిపాలన సౌలభ్యం సులభంగా ఉంటుందన్నారు. ప్రజలు జిల్లా విభజనతో ఎంతో లాభం కలుగుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అల్లూరి కలెక్టర్